## క్లుప్తంగా

### ఫర్నిచర్ అందజేత



**ఎల్లారెడ్డిరూరల్:** రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాలకు మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మంగళవారం ఫర్నిచర్ అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సత్యనారాయణ పాఠశాలకు 80 కుర్చీలు, రెండు బ్లాక్ బోర్డులతో పాటు ఇతర సామగ్రిని అందించారు. ఏఎంసీ చైర్మన్ రజిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సామెల్, పద్మారావు, అశోక్‌రెడ్డి ఉన్నారు.

### 'సవాళ్లను అధిగమించి విజేతలుగా నిలవాలి'

**కామారెడ్డి అర్బన్:** ప్రతి ఒక్కరి జీవితం పూలదారి కాదని, విజయం సాధించిన వ్యక్తులు కష్టాలు, సవాళ్లను అధిగమించి ధైర్యంగా ముందుకు వెళ్లి విజేతలుగా నిలిచారని ఇంపాక్ట్ ట్రైనర్, మోటివేషనల్ స్పీకర్ రమేష్ చైతన్య అన్నారు. చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం 'జీవితంలో లక్ష్యాలు, సవాళ్లు' అనే అంశంపై మోటివేటర్ రమేష్ చైతన్య మాట్లాడారు. ఈ సందర్భంగా రమేష్ చైతన్యను ఉపాధ్యాయులు సన్మానించారు. చదువులో, జీవితంలో వైఫల్యాలను ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. ఆత్మహత్యలు పిరికి వారు చేసే చర్యలన్నారు.

### పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలి

**పిట్లం(జుక్కల్):** ప్రజలందరూ పన్నులను కాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని రాంపూర్‌గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం రాంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంటింటికి తిరిగి పన్నులను వసూలు చేశారు.

### శిఖం కబ్జాపై జాయింట్ సర్వే

**నిజాంసాగర్(జుక్కల్):** సుల్తాన్ నగర్ శివారులోని ఎరుకల వాణి కుంట శిఖం భూమి కబ్జాపై మంగళవారం రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు జాయింట్ సర్వే చేశారు. ఎరుకలవాణి కుంట మూడు ఎకరాలు విస్తీర్ణంలో ఉండగా ఎకరం భూమిని ఒకరిద్దరు దర్జాగా కబ్జా చేసుకున్నారు. శిఖం కబ్జాపై గ్రామస్తులు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా.. రెవెన్యూ సర్వేయర్ శ్రీకాంత్, నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాశీనాథ్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. అర ఎకరంపైగా శిఖం భూమి కబ్జాకు గురైనట్లు అధికారులు సర్వేలో తేల్చారు. భూమిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు.

### ఉచిత పశు వైద్య శిబిరం

**నస్రుల్లాబాద్(బాన్సువాడ):** సంగం గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం కార్యక్రమాన్ని పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్ ప్రారంభించి రైతులతో మాట్లాడారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పెద్ద కొడప్‌గల్ పశువైద్యాధికారి మణి కుమార్, జీవీవో తుకారాం, పశువైద్య సహాయకులు వెంకటేష్, బాబయ్య, గోపాల్ మిత్రులు, రైతులు ఉన్నారు.

### అభినందనలు

**కామారెడ్డి టౌన్:** కామారెడ్డి సబ్ స్టేషన్ నుంచి నిజాంసాగర్ రోడ్– దేవునిపల్లి వరకు 83 ఫీట్ల రోడ్డు ఏర్పాటు కోసం భూమిని మున్సిపల్‌కు గిఫ్ట్ డీడ్ చేయడానికి ముందుకు వచ్చిన భూయజమానులకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ ప్రాంతంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉన్నందున 83 ఫీట్ల రోడ్డు వేయాలని గతంలోనే అధికారులకు విన్నవించినట్లు పేర్కొన్నారు. తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని వివరించారు.

### 'రాజ్యాంగంతో మానవ హక్కులను కాపాడుకోవాలి'



**కామారెడ్డి అర్బన్:** అడవి జంతువులు తమకు కావాల్సినంత ఆహారం లభించగానే వేటను నిలిపివేస్తాయని, నేటి ఆధునిక సమాజంలో అన్నీ తెలిసిన మనిషి సాటి బలహీనుడైన మనిషిని నిరంతరం పీక్కుతింటున్నారని, హక్కులను కాలరాస్తున్నారని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం మంగళవారం కళాశాల పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. రాజ్యాంగం, చట్టాలను వినియోగించుకుని ప్రతి ఒక్కరూ రక్షించుకోవాలని, అభివృద్ధి చెందాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, అకడమిక్, యూజీసీ సమన్వయకర్తలు పి.విశ్వప్రసాద్, గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



పేట్‌సంగెంలో ..



తాడ్వాయిలో..



లింగంపేటలో ..



దోమకొండలో గెలుపొందిన క్రీడాకారులతో మండల అధికారులు



బీబీపేటలో ..

# ఘనంగా సీఎం కప్ క్రీడలు ప్రారంభం

జిల్లాలో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని రెండింటినీ సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలగడమే కాకుండా శరీరం దృఢంగా తయారవుతుందన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డిలో వాలీబాల్‌ను సర్వ్ చేస్తూ ఆటల పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



నస్రుల్లాబాద్‌లో..



నిజాంసాగర్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో గంగాధర్



జుక్కల్‌లో పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో శ్రీనివాస్



పెద్దకొడప్‌గల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న తహసీల్దార్ దశరథ్



నాగిరెడ్డిపేటలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ప్రత్యేకాధికారిణి రత్నం



సదాశివనగర్‌లో పరిచయం చేసుకుంటున్న జెడ్పీ సీఈవో చందర్ నాయక్



బాన్సువాడలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



మాచారెడ్డిలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్ రావు

# ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు



నస్రుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఆశా కార్యకర్తలు



పిట్లంలో ..

తమ సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ మహాధర్నాకు తరలి వెళ్తున్న జిల్లాకు చెందిన ఆశావార్కర్లను పోలీసులు మంగళవారం ఉదయం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్లకు తరలించారు.ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. హక్కుల కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశావర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బిచ్కుందలో..



ఎల్లారెడ్డిలో..

### ఘనంగా ఎల్లమ్మ పండగ



**బిచ్కుంద(జుక్కల్):** చిన్నదడ్గిలో మంగళవారం ఎల్లమ్మ పండగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు తీసుకొని ఎల్లమ్మ దేవతకు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గుడి వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమం చేసి భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. చిన్నదడ్గి, చిన్న దేవాడ, మనేపూర్ ప్రజలు పాల్గొన్నారు.

### మాజీ ఎంపీపీ భారీ విరాళం



**కామారెడ్డి అర్బన్:** కామారెడ్డి అయ్యప్పసేవా ఫంక్షన్ హాల్‌లో ఏసీ అభివృద్ధి కోసం రూ.5 లక్షలు విరాళం ప్రకటించిన మాచారెడ్డి మాజీ ఎంపీపీ ఎల్.నర్సింగరావును సేవా సమితి ప్రతినిధులు జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు ఉదయ్, శ్రీనివాస్, ఎం.శ్రీకాంత్, అనిల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం..

### నేడు శ్రీగీతా జయంతి ఉత్సవం

**కామారెడ్డి అర్బన్:** స్థానిక సిరిసిల్ల రోడ్డులోని శ్రీకృష్ణ గీతా మందిరంలో ఈ నెల 11న బుధవారం శ్రీగీతా జయంతి సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీగీతతత్వార్థ జ్ఞాన సత్సంగం ప్రతినిధులు తెలిపారు.

### 15న పట్టణ మేరు సంఘం ఎన్నికలు

**కామారెడ్డి టౌన్:** కామారెడ్డి పట్టణ మేరు సంఘం నూతన కమిటీ ఎన్నికలను ఈనెల 15న జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘం ఎన్నికల అధికారులు గణేష్, రఘునాథ్‌లు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం భవనంలో వారు మాట్లాడారు. పోటీకి రెండు ప్యానల్స్ నుంచి నామినేషన్లు వచ్చాయని, వారికి గుర్తులు కేటాయించినట్లు వివరించారు. మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు సరికొండ నారాయణ, గౌరవ అధ్యక్షుడు రాచర్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి



**దోమకొండ:** ఇంటర్ విద్యార్థులను వార్షిక పరీక్షలను సిద్ధం చేయాలని ఇంటర్‌మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో స్టాఫ్ సమావేశం నిర్వహించి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసి మంచి ఫలితాలు వచ్చే విధంగా చూడాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు ఉన్నారు.

## సంక్షిప్తం

### విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ మృతి

**కామారెడ్డి అర్బన్ :** కామారెడ్డి పట్టణానికి చెందిన విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ చంద్ మంగళవారం మరణించారు. కామారెడ్డి పట్టణంలో జైన్ సమాజ్‌కు సంబంధించి దాదాపు 40 కుటుంబాలు ఉన్నాయి. వారిలో ప్రకాష్ చంద్ ఒక్కరే ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. ఆయన కామారెడ్డి తహసీల్, ఆర్డీవో కార్యాలయాలలో డిప్యూటీ తహసీల్దార్‌గా సేవలందించారు.

### లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మహేందర్, ఎస్సై

**పెద్దకొడప్‌గల్(జుక్కల్):** లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 14 వరకు బిచ్కుంద కోర్టులో లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. న్యాయస్థానాలు ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై అన్నారు.

### దోమకొండ నుంచి శబరిమలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు

**దోమకొండ:** మండల కేంద్రం నుంచి కేరళ రాష్ట్రంలోని శబరిమలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సును నడపనున్నట్లు ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర మంగళవారం తెలిపారు. దోమకొండకు చెందిన అయ్యప్పస్వామి భక్తులు ఇందిరను కలిసి ప్రత్యేక బస్సు కోసం వినతిపత్రం అందజేయగా ఆమె స్పందించి ఏసీ బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు అయ్యప్పస్వాములు తెలిపారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ లింగమూర్తి, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

### వాహనాల తనిఖీ

**దోమకొండ:** మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై అంజనేయులు ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పెండింగ్ చలాన్లు కట్టించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేశారు. ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

### చదువులతో పాటు క్రీడలూ ముఖ్యమే

**మద్నూర్(జుక్కల్):** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమేనని మండల ప్రత్యేకాధికారి నాగరాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో రాణీ, ఏంఈవో రాములు పాల్గొన్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**గాంధారి(ఎల్లారెడ్డి):** గండివేట్, సీతాయిపల్లి, ముదెల్లి, గౌరారం గ్రామాల్లో మంగళవారం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసినట్లు డీటీ రవి తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల చేతుల మీదుగ చెక్కులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

### జూనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి

**కామారెడ్డి అర్బన్:** భిక్కనూర్ జీపీకి జూనియర్ అసిస్టెంట్‌గా డిప్యుటేషన్‌పై వచ్చిన సిద్ధిరాములును ఆయన పోస్టింగ్ ఉన్న బాన్సువాడ తాడ్కోల్‌కు పంపించాలని కోరుతూ సమాచార హక్కు పరిరక్షణ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవి, డీపీవోకు వినతి పత్రం అందజేశారు. సిద్ధిరాములు 13 ఏళ్లుగా భిక్కనూర్ జీపీలో జూనియన్ అసిస్టెంట్‌గా పని చేసి రెండు నెలల క్రితమే తాడ్కోల్‌కు బదిలీ కాగా.. తిరిగి భిక్కనూర్‌కు వచ్చి చేరారని, ఆయన డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని కోరారు. 13 యేళ్లుగా భిక్కనూర్‌లో పాతుకుపోయి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

# ట్రై సైకిళ్లు, కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు పంపిణీ చేస్తున్న మోహన్ రెడ్డి

**నస్రుల్లాబాద్(బాన్సువాడ):** నెమ్లి గ్రామ షిర్డీ సాయి కల్యాణ మండపంలో మంగళవారం ఆలయ ధర్మకర్త పట్లోళ్ల మోహన్ రెడ్డి(ఎన్‌ఆర్‌ఐ) దివ్యాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు, కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు సహాయ పడాలన్న ఉద్దేశంతో తెలంగాణ అమెరికన్ అసోసియేషన్ స్థాపించామన్నారు. అందులో భాగంగానే ప్రతి సంవత్సరం తెలంగాణలో సేవా కార్యక్రమాలను చేయాలని నిర్ణయించుకుని ఈ ఏడాది ఉమ్మడి నిజామాబాద్ జిల్లా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించాలని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ సభ్యులు సైతం అమెరికా నుంచి ఇక్కడి రావడం సంతోషంగా ఉందన్నారు. నెల రోజుల క్రితం ఎంపిక చేసిన వారిలో 110 మందికి కృత్రిమ అవయవాలను, 55 ట్రై సైకిళ్లను అందిస్తున్నామని రెండవ విడుతలో సైతం మిగతా వారికి అందిస్తామన్నారు. అసోసియేషన్ చైర్మన్ విజయ్ పాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నందు రెడ్డి, అసోసియేషన్ కమిటీ సభ్యులు నవీన్, ద్వారక్ నాథ్, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

### ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి



**పెద్దకొడప్‌గల్(జుక్కల్):** తరుచూ ప్రమాదాలు జరగకుండా హైవే సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఐ నరేశ్ సూచించారు. మండలంలోని బేగంపూర్ చౌరస్తా సమీపంలో జాతీయ రహదారి–161పై గతంలో జరిగిన ప్రమాద స్థలాన్ని సీఐతో పాటు వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. ఈ స్థలం వద్ద ప్రమాదం జరగడానికి గల కారణాలను పరిశీలించి హైవే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఎస్సై మహేందర్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రజనీబాయి, జాతీయ రహదారి సిబ్బంది పాల్గొన్నారు.

### పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



**గాంధారి(ఎల్లారెడ్డి):** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోక్సో చట్టం, ఆర్థిక అక్షరాస్యత, లింగ సమానత్వంపై మంగళవారం విద్యార్థులకు ఎల్లారెడ్డి డివిజన్ షీటీం, మహిళా సాధికారిక కేంద్రం కామారెడ్డి అధికారులు సుప్రజ, శిరీష, శారద, తులసి, సంధ్య అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ గంగారాం తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, పోక్సో చట్టంలోని కఠినమైన చట్టాల గురించి వివరించారు. ఆడ పిల్లలు ఉన్నత చదువులు చదవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే ఆర్థిక అక్షరాస్యత గురించి తెలుసుకోవాలన్నారు.

# 'ఆటోలను ఎక్కడ పార్క్ చేయాలి'

**పిట్లం(జుక్కల్):** మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై ఆటో డ్రైవర్లు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ.. పిట్లంలో రోడ్డు విస్తరణ పనుల వల్ల ఖాళీ స్థలం లేకపోవడంతో ఆటోలు నిలుపుకోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు. బస్టాండ్‌లో నిలుపుకుందామంటే ఆర్టీసీ అధికారులు జరిమానాలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఆటోలను ఎక్కడ నిలుపుకోవాలని ప్రశ్నించారు. అర్ధగంట సేపు రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటో డ్రైవర్లతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.



పిట్లంలో రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

### రోడ్డు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వినతి



**కామారెడ్డి టౌన్:** పాత జాతీయ రహదారి 132 సబ్ స్టేషన్ పక్కన నుంచి దేవునిపల్లి నిజాంసాగర్ రోడ్డు వరకు 83 ఫీట్ల రోడ్డు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి భూమి పట్టాదారులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ప్రజల రవాణా సౌకర్యం కోసం ఈ రోడ్డు ఏర్పాటుకు అక్కడి భూయజమానులు భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తక్షణమే రోడ్డు మార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యజమానులు కే. మారుతి, పాత లక్ష్మణ్, ఉమారాణి, శంకర్, లక్ష్మీపతి తదితరులున్నారు.

### భూదాత ఇనానిసేట్‌కు ఘన నివాళి



**మద్నూర్(జుక్కల్):** ప్రభుత్వ ఆస్పత్రి, జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాల ఇలా మద్నూర్‌లోని పలు భవనాలకు భూదానం చేసిన రాం ప్రసాద్ ఇనాని జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఇనాని కుటుంబీకులు, గ్రామస్తులు అందరు కలిసి నివాళులర్పించారు. స్థానిక పాత బస్టాండ్‌లోని రాంప్రసాద్ ఇనాని విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. మద్నూర్ గ్రామ అభివృద్ధి కోసం ఇనానిసేట్ ఎంతో పరితపించేవారని గ్రామ పెద్దలు అన్నారు. ఇనాని సేట్‌కి జై అంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు.

### వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్వంచ విద్యార్థుల ప్రతిభ



**మాచారెడ్డి:** ఇటీవల బాన్సువాడలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని పాల్వంచ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు ఈశ్వర్, సాత్విక్ ద్వితీయ, అభిలాష్, సంజయ్, కీర్తనలు తృతీయ బహుమతులు సాధించారని పేర్కొన్నారు. మంగళవారం డీఈవో రాజు వారికి ప్రశంస పత్రాలు అందించారని తెలిపారు.

### శ్మశానవాటిక రోడ్డు కోసం సర్వే



**నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి):** ఆత్మకూర్ శివారులో గల బీసీల శ్మశానవాటికకు రోడ్డు ఏర్పాటు కోసం మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. శ్మశానవాటికకు రోడ్డు లేక చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిసి నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఆర్‌ఐ మమ్మాద్, సర్వేయర్ కరుణాకర్ గ్రామానికి చేరుకొని సర్వే చేపట్టారు. వారంరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని వారు చెప్పారు. మాజీ జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి ఉన్నారు.

## క్లుప్తంగా...

### 17 నుంచి శ్రీవారికి తిరుప్పావై

**16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం**

**తిరుమల:** తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16న ప్రారంభం కానుంది. ఆరోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబరు 17 నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. జనవరి 14తో ధనుర్మాస ఘడియలు ముగియనున్నాయి. ఈసందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారు.

### రద్దీ రోజుల్లోనూ మల్లన్న స్పర్శ దర్శనం

**శ్రీశైలం టెంపుల్:** రద్దీ రోజుల్లోనూ శ్రీశైల మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలువురు భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో, ప్రభుత్వ సెలవు దినాలు తదితర రద్దీ రోజుల్లోనూ నిర్దిష్ట వేళల్లో మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మల్లన్న స్పర్శదర్శనం ఉంటుందన్నారు. గతంలో మాదిరిగానే స్పర్శ దర్శనం టికెట్లను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పొందాల్సి ఉంటుందన్నారు.

### డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన అదే విభాగం జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జి.వైజయంతి గత నెల 30న పదవీ విరమణ చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

# 'సానా'కు శానా చేస్తున్నారు..

## రాజ్యసభ అవకాశం ఇవ్వడంపై టీడీపీలో తీవ్ర విమర్శలు

- ఒత్తిళ్లకు సీఎం చంద్రబాబు లొంగిపోయారని నేతల ఆగ్రహం
- సీబీఐ, ఈడీ కేసులున్న వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ఆందోళన
- కొత్త నేతను అందలం ఎక్కిస్తే తమ పరిస్థితి ఏమిటని సీనియర్ల నిలదీత
- ఎవరెన్ని చెప్పినా అలాంటి నేతలే అవసరమని సీఎం స్పష్టీకరణ



**సాక్షి, అమరావతి :** మనీ లాండరింగ్, హవాలా కేసులు సహా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర ఉన్న సానా సతీష్‌కు సీఎం చంద్రబాబు రాజ్యసభ సీటు ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. లాబీయింగ్, అవినీతి వ్యవహారాలతో అంటకాగే వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం సరికాదంటూ టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో, వ్యక్తిగత సంభాషణల్లో విరుచుకుపడుతున్నారు. పార్టీ కోసం సుదీర్ఘ కాలం నుంచి పని చేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా పార్టీలోకి వచ్చి పెత్తనం చెలాయిస్తున్న సానా సతీష్‌కు ఉన్నత పదవి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆయనకు పదవి ఇస్తున్నారని కొన్ని రోజుల క్రితమే తెలియడంతో చాలా మంది ముఖ్య నేతలు చంద్రబాబును కలిసి తమ అసంతృప్తి వెలిబుచ్చారు. ఎంతో మంది సీనియర్లు ఉండగా, తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని పరిగణనలోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే తమ లాంటి సీనియర్ల పరిస్థితి ఏమిటని.. క్యాడర్‌కు, నాయకులకు ఏం సమాధానం చెప్పాలని అడిగినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో, అంతకు ముందు.. పార్టీకి భారీగా నిధులు ఇచ్చిన వారికి ఇప్పుడు న్యాయం చేయక తప్పదని ఆయన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. లోకేశ్ పాదయాత్రలో సతీష్ లాంటి నేతలు చాలా ఉపయోగపడ్డారని, వారు డబ్బు ఖర్చు చేశారు కాబట్టే అధికారంలోకి వచ్చాక ప్రతిఫలం ఇస్తున్నామని స్పష్టం చేసినట్లు.. అంతటితో ఆగకుండా పార్టీలో కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు స్పందించిన తీరుతో సీనియర్ నాయకుల్లో ఇంకా ఆగ్రహం పెరిగిపోయింది. పార్టీ చంద్రబాబు చేతుల్లో లేదని, లోకేశ్ కోటరీ చేతుల్లో ఉందని చర్చించుకుంటున్నారు. లోకేశ్ కోటరీలో అత్యంత కీలకంగా ఉంటూ బదిలీలు, కాంట్రాక్టులు సహా అన్ని వ్యవహారాలను సానా సతీష్ చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో ఆయన పేరును రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు ప్రకటించక తప్పలేదంటున్నారు.

### విస్తుగొలిపే తీవ్ర ఆరోపణలు

- సానా సతీష్‌పై మనీ లాండరింగ్ అభియోగాలుండడంతో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ కేసులకు సంబంధించి 2019 జూలైలో ఆయన్ను ఈడీ అరెస్టు చేసి జైలుకు పంపింది.
- మనీ లాండరింగ్, హవాలా కేసుల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మీట్ వ్యాపారి మొయిన్ ఖురేషీతో సతీష్‌కు సన్నిహిత సంబంధాలున్నట్లు తేలింది. ఖురేషీతో కలిసి అక్రమ వ్యాపారాలు కూడా చేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే తనపై ఉన్న మనీ లాండరింగ్ కేసుల నుంచి తప్పించుకునేందు ఖురేషీ ద్వారా సీబీఐ అధికారులకు సతీష్ లంచం ఇచ్చినట్లు స్పష్టమైంది.
- అదే సమయంలో సీబీఐ డైరెక్టర్‌గా పని చేసిన రాకేష్ ఆస్థానా, మరో సీబీఐ అధికారి అలోక్ వర్మ మధ్య చిచ్చుపెట్టి.. ఏకంగా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర సతీష్‌ది. తనను కేసు నుంచి తప్పించేందుకు సీబీఐ డిప్యూటీ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాకు రూ.2 కోట్లు లంచం ఇచ్చినట్లు స్పష్టమవడంతో ఈడీ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు.
- తనపై ఉన్న ఆరోపణలను కొట్టేయాలంటూ ఈ ఏడాది జులైలో సానా సతీష్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా దాన్ని కోర్టు కొట్టివేసింది. ఇలా తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని విచారించాల్సిందేనని స్పష్టం చేసింది.

### సబ్ ఇంజనీర్ నుంచి కోట్లకు పడగలెత్తి..

- కాకినాడకు చెందిన సానా సతీష్ మొదట్లో విద్యుత్ శాఖలో సబ్ ఇంజనీర్‌గా పని చేశారు. ఉద్యోగం వదిలేశాక అక్రమ వ్యాపారాలతో కోట్లు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే మనీ లాండరింగ్, హవాలా కేసులు నమోదయ్యాయి. అలాంటి వ్యక్తి చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు.
- అక్రమంగా సంపాదించిన డబ్బును ఖర్చు చేసి వారికి బాగా దగ్గరయ్యారు. లోకేశ్ పాదయాత్ర ఖర్చును చాలా వరకు సతీష్ భరించినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీగా డబ్బు సమకూర్చినట్లు తెలిసింది. చాలా వ్యవహారాల్లో లోకేశ్ వెన్నంటే ఉండి అన్నీ సమకూర్చినట్లు చెబుతున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా అవతరించారు.
- మంత్రి పదవులు, ఉన్నతాధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు, కాంట్రాక్టులు ఇతర అనేక వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవి ఆయన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా కాకలు తీరిన సీనియర్ నేతలను కాదని రాజ్యసభ సీటునే తన్నుకుపోయారు.

### అది విప్లవాత్మక ఆవిష్కరణ

**గుండె వాల్వ్‌ల చికిత్సలో 'మైవాల్ ఆక్టోప్రో'పై కార్డియాలజిస్టులు**

**సాక్షి, హైదరాబాద్:** 'మైవాల్ ఆక్టో ప్రో ట్రాన్స్ క్యాథెటర్ హార్ట్ వాల్వ్' అనే ఉపకరణం గుండె చికిత్సల్లో విప్లవాత్మక మార్పు తెస్తుందని కార్డియాలజిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ ఉపకరణాన్ని కనుగొనడం గుండె చికిత్సల్లో కీలక మైలురాయిగా అభివర్ణించారు. నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇటాలియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, పీసీఆర్ లండన్ వాల్వ్స్–2024 వంటి అంతర్జాతీయ వేదికలపై ఓ భారత కంపెనీ ఉపకరణాన్ని పలువురు కొనియాడటం భారతీయులకు ఎంతో గర్వకారణమని చెన్నైకు చెందిన డాక్టర్ అనంతరామన్, డాక్టర్ జాన్ జోస్, డాక్టర్ సెంగొట్టువేలు ప్రశంసించారు. గుండె చికిత్సల ఉపకరణాలను అభివృద్ధి చేస్తున్న 'మెరిల్ లైఫ్ సైన్సెస్' సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉపకరణం రూపుదిద్దుకుంది. ఈ ఉపకరణం ద్వారా గుండెను పూర్తిగా తెరవకుండానే చిన్న గాటుతో 'అయోర్టిక్ వాల్వ్'లో వచ్చే లోపాలకు చికిత్స అందించవచ్చని మెరిల్ లైఫ్ సైన్సెస్ ఓ ప్రకటనలో పేర్కొంది.

### 14న దుర్గమ్మ కలశజ్యోతి మహోత్సవం

**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు కలశజ్యోతి మహోత్సవం జరగనుంది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడ, సత్యనారాయణపురం శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి భవానీలు, అమ్మవారి భక్తులు జ్యోతులను పట్టుకుని ఇంద్రకీలాద్రికి వస్తారు. భవానీలు తమ కలశజ్యోతులను కనకదుర్గ నగర్‌లో సమర్పించడంతో పాటు మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కలశ జ్యోతుల నేపథ్యంలో శనివారం రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు.

# ప్రశ్నిస్తే పనిపడతా!

- బీసీ నేతల మధ్య చంద్రబాబు చిచ్చు
- కేవీ రావుకు వ్యతిరేకంగా యనమల లేఖాస్త్రం
- దీనిపై రెడ్డి సుబ్రహ్మణ్యం ఘాటు వ్యాఖ్యలు
- ఇదంతా సీఎం సూచనల మేరకే అంటున్న నేతలు
- యనమల టార్గెట్‌గా సోషల్ మీడియాలోనూ పోస్టులు

**సాక్షి, అమరావతి :** రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే చంద్రబాబు ఇప్పుడు పార్టీలోని ఇద్దరు బీసీ నేతల మధ్య చిచ్చు పెట్టారు. సుదీర్ఘ కాలం నుంచి తనకు బలమైన మద్దతుదారుగా ఉన్న సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలను జీర్ణించుకోలేక ప్రశ్నించడంతో ఆయనపైకి మరో సీనియర్ నేత, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంను ఉసిగొల్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా టీడీపీ సోషల్ మీడియా కూడా యనమలకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయి ఆరోపణలతో ట్రోల్ చేస్తోంది. దీనికంతటికీ కాకినాడ పోర్టు వ్యవహారంలో చంద్రబాబు వైఖరికి విరుద్ధంగా యనమల రామకృష్ణుడు ఆయనకు లేఖ రాయడమే కారణం. కాకినాడ పోర్టుకు చెందిన కేవీ రావు చౌదరికి చంద్రబాబు మద్దతు పలుకుతూ రాజకీయంగా ఆయన్ను పావులా వాడుకుంటున్నారు. కానీ యనమల మాత్రం తాను రాసిన లేఖలో కేవీ రావు చౌదరి కాకినాడ సెజ్ భూముల ద్వారా వేల కోట్ల లబ్ధి పొందారని.. బీసీ, మత్స్యకార రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తనను ధిక్కరిస్తూ లేఖ రాయడంతో చంద్రబాబు.. యనమలను ప్రశ్నించకుండా ఇతర బీసీ నేతలను ఆయనపైకి ప్రయోగించినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే రెడ్డి సుబ్రహ్మణ్యం బహిరంగంగా యనమల రామకృష్ణుడిపై ఆరోపణలు గుప్పించారు. 40 ఏళ్లుగా యనమల బీసీల గురించి పట్టించుకోలేదని, ఇప్పుడు తనకు పదవి ఇవ్వలేదనే కారణంతో చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయనకు తోడుగా మరికొందరు కింది స్థాయి నేతలు కూడా యనమలపై విమర్శలు చేశారు. టీడీపీ సోషల్ మీడియా అయితే యనమల పార్టీలో ఉన్న విషయాన్ని కూడా మరచిపోయి ఆడేసుకుంటోంది.




### చంద్రబాబుకు తెలియకుండానే తిడతారా?

పార్టీలో తన స్థాయి ఉన్న ఒక సీనియర్ బీసీ నాయకుడిని, మరో సీనియర్ బీసీ నాయకుడు బహిరంగంగా తిట్టారంటే అందుకు చంద్రబాబు పరోక్ష అనుమతి కచ్చితంగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యనమలకు వ్యతిరేకంగా పార్టీలోనే ఇంత జరుగుతున్నా, చంద్రబాబు స్పందించక పోవడాన్ని బట్టి ఆయన అభిమతం ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు కొందరు బీసీ నేతలు యనమలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. చంద్రబాబుకు ఆది నుంచి తోడు, నీడగా ఉన్న నాయకుడిని ఇలా అవమానించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా పార్టీలోనే బీసీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకునే పరిస్థితి ఏర్పడినా, చంద్రబాబు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం టీడీపీలో జరుగుతున్న పరిణామాల పట్ల యనమల రామకృష్ణుడు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనలాంటి సీనియర్లను పూర్తిగా పక్కన పెట్టేయడంతో ఆయన ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీనికితోడు కాకినాడ పోర్టు, సెజ్ విషయంలో కేవీ రావు చౌదరికి అనుకూలంగా వ్యవహరించడం, రాజ్యసభ స్థానాలను లాబీయిస్టులకు కట్టబెడుతుండడంతో తట్టుకోలేక ఆయన తొలిసారిగా చంద్రబాబును ధిక్కరించి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడం నుంచి చంద్రబాబుతో కలిసి పని చేసిన యనమల లాంటి నాయకుడు తిరుగుబాటు స్వరం వినిపించడంతో పార్టీలో గందరగోళం నెలకొంది.

# లంచం ఇవ్వొద్దు.. ఏసీబీకి సమాచారమివ్వండి

- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాదిలో 10 కేసులు నమోదు
- పాత కేసుల్లో ఇద్దరికి శిక్ష ఖరారు
- ఈనెల 3 నుంచి 9వరకు కొనసాగిన ఏసీబీ వారోత్సవాలు



ఉమ్మడి నిజామాబాద్ ఏసీబీ ఆఫీస్

**ఖలీల్‌వాడి:** ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని తమ విధుల్లో లంచాన్ని భాగం చేసుకున్న ప్రభుత్వ అధికారుల పని పడుతోంది అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ). లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని స్పష్టం చేస్తున్న ఏసీబీ.. అధికారులు ఎవరైనా లంచం అడిగితే తమకు సమాచారం అందించాలని విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది.

అవినీతి అధికారుల ఆట కట్టించడమే లక్ష్యంగా ఏసీబీ పని చేస్తోంది. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిరోధక వారోత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ ఏడాది 10 కేసులు నమోదైనట్లు ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

**తీరు మార్చుకోని అధికారులు**

ఓ వైపు లంచం డిమాండ్ చేసి అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నా మరో వైపు కొంత మంది అధికారులు తమ తీరును మార్చుకోవడం లేదు. తమ ముందుకు వచ్చిన ఫైళ్లను వెంటవెంటనే క్లియర్ చేయాల్సిన బాధ్యతను పక్కనపెట్టి చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. రాజకీయ నాయకులు తమ పనులను పలుకుబడితో పూర్తి చేయించుకుంటే, సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది. దీంతో కొంత మంది బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం కేసుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా విద్య, వైద్యం, రెవెన్యూ, మున్సిపల్, రవాణ, ట్రెజరీ, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, జెడ్పీ, అగ్నిమాపక, ఎక్సైజ్, అటవీ, పోలీసు, వ్యవసాయశాఖ ఇలా పలు శాఖల్లో కొంత మంది కారణంగా అవినీతి రాజ్యమేలుతోంది.

| మూడేళ్లలో కేసులు.. | |
|---|---|
| 2022 | 7 |
| 2023 | 7 |
| 2024 | 10 |
| (డిసెంబర్ 1 వరకు) | |

### ఉమ్మడి జిల్లాలో రెండు కేసుల్లో శిక్ష

- 2008లో మాక్లూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏఈ సదాశివ్ రూ.3 వేలు డిమాండ్ చేయడంతో శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తిని ఏసీబీని ఆశ్రయించారు. ఈ కేసులో నాంపల్లి కోర్టు నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధించింది.
- 2012లో నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లో సీసీ రోడ్డు పనుల ఎస్టిమేషన్‌కు బండారి అర్వింద్ అనే వ్యక్తిని ఏఈ అశోక్ రూ.20 వేలు డిమాండ్ చేశారు. అర్వింద్ ఏసీబీని ఆశ్రయించగా ఏఈని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు ఏఈకి రెండేళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధించింది.

### ఫిర్యాదు చేయొచ్చు ఇలా..

ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 1064కి సమాచారం అందించాలి. ఏసీబీ కార్యాలయంలో నేరుగా సంప్రదించే అవకాశమూ ఉంది. ఫిర్యాదారుల వివరాలను ఏసీబీ అధికారులు గోప్యంగా ఉంచుతారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే దాడులు నిర్వహిస్తారు.

**ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు :**
శేఖర్‌గౌడ్, డీఎస్పీ – 91543 88950, నగేశ్, సీఐ – 91543 88951, శ్రీనివాస్, సీఐ – 91543 88953, వేణుకుమార్, సీఐ – 91548 88928.

**ఆఫీస్ అడ్రస్:**
ఏసీబీ కార్యాలయం, కంఠేశ్వర్ ఏరియా, అయ్యప్పస్వామి గుడి దగ్గర.

### ఈ ఏడాది నమోదైన కేసులు

- కామారెడ్డి సబ్‌స్టేషన్‌లో అద్దె ప్రాతిపదికన వాహనాన్ని తీసుకునేందుకు సంతోష్ అనే వ్యక్తి నుంచి ఏఈ సాయిని రాజు రూ.12,500 లంచం డిమాండ్ చేశాడు. లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డాడు.
- జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన గ్రామ పంచాయితీ కార్యదర్శి మనోహర్ ఓనర్ సర్టిఫికేట్ కోసం రూ.4 వేలు డిమాండ్ చేయడంతో నిఖిల్ అనే వ్యక్తి ఏసీబీని ఆశ్రయించగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో రావుట్ల బాగయ్య ఎస్ఆర్ బుక్‌ను సెట్ చేయడానికి ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ హరిబాబు రూ.8 వేలు డిమాండ్ చేసి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఆర్మూర్ కోర్టులో సిబ్బంది డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.
- నందిపేట్‌లో ఇంటి నిర్మాణ అనుమతి ఇచ్చేందుకు ఆటో డ్రైవర్ సంతోష్ నుంచి సెక్రెటరీ నవీన్‌కుమార్ రూ.8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- వర్ని ఎస్సై కృష్ణ స్టేషన్ బెయిల్ కోసం రూ.20 వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు నాగరాజు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నాగరాజు నుంచి ఎస్సై కృష్ణ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.
- లింగంపేట్ ఎస్సై అరుణ్, కానిస్టేబుల్ రామస్వామి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు శివలింగం అనే వ్యక్తి నుంచి రూ.10 వేలు డిమాండ్ చేశారు. శివలింగం ఏసీబీని ఆశ్రయించడంతో ఎస్సై, కానిస్టేబుల్‌ను పట్టుకున్నారు.
- బోధన్ మండలంలోని సాలూరా చెక్ పోస్టు వద్ద ఏసీబీ తనిఖీలు చేసి కేసు నమోదు చేశారు.
- నిజామాబాద్ నగరంలోని కోటగల్లీలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు.
- నిజామాబాద్ నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఉద్యోగి నరేందర్ ఇంటిలో రూ.2.93 కోట్లు పట్టుబడగా, ఆయనపై కేసు నమోదు చేశారు.

### లంచం ఇవ్వొద్దు

ఎవరూ లంచం ఇవ్వవద్దు. అధికారులు ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా ఏసీబీ అధికారులకు ఫోన్‌లో సమాచారం అందించాలి. నేరుగా ఏసీబీ కార్యాలయంలోనూ సంప్రదించొచ్చు. ప్రజల్లో చైతన్యం వస్తోంది. అధికారులు ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకుండా ప్రజలకు పనులు చేయాలి.

– శేఖర్‌గౌడ్, ఏసీబీ డీఎస్పీ, నిజామాబాద్

### భూసార పరీక్షలు చేయించుకుని పంటలు సాగు చేయాలి



**భిక్కనూరు:** రైతులు ప్రతి ఏడాది భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖాధికారిణి జ్యోతి అన్నారు. మంగళవారం జంగంపల్లిలో నిర్వహిస్తున్న మల్బరి సాగు అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మల్బరి సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపై బిందు సేద్యం పరికరాలను అందిస్తామన్నారు. మల్బరీ పంట సాగుకు ముందుకు వస్తే తమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇస్తామన్నారు. అధికారులు ఐలయ్య, రాజయ్య, సాంకేతిక సహాయకులు నాగేందర్, సునీల్, సౌత్‌క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

### 12న అంగన్‌వాడీల చలో హైదరాబాద్



**బాన్సువాడ:** ఈ నెల 12న అంగన్‌వాడీ టీచర్లు చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ తెలిపారు. మంగళవారం బాన్సువాడ సీడీపీవో కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు మహాదేవి, అరుణ, స్వరూప తదితరులున్నారు.

## ఆధ్యాత్మికం

**ఘనంగా గజ్జలమ్మ జాతర**




**వర్ని:** మండలంలోని తగిలేపల్లిలో గ్రామస్తులు మంగళవారం గజ్జలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. మాఘ మాసంలో ప్రతి ఏడాది గజ్జలమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా మంగళ, బుధవారాలు జాతరను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి గజ్జలమ్మ మాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజుల విన్యాసాల మధ్య ఆలయం చుట్టూ రథాన్ని తిప్పారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు భక్తుల, గ్రామస్తులు పాల్గొన్నారు.

**మల్లన్న స్వామికి నైవేద్యాలు**



**వేల్పూర్:** మండలంలోని పచ్చలనడ్కుడ కొమురెల్లి జాతరలో భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. జాతర జరిగిన మరుసటిరోజున భక్తులు నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. మల్లన్న స్వామి గ్రామాన్ని ఏడాది పాటు క్షేమంగా కాపాడి, పాడిపంటలు సమృద్ధిగా అనుగ్రహించాడని నమ్మి నైవేద్యాలు సమర్పిస్తారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

### 41రోజుల్లో 14వందల కి.మీ నడక



**రుద్రూర్:** రుద్రూర్‌కు చెందిన అయ్యప్ప మాల ధారణ స్వాములు ఐదుగురు 41 రోజులపాటు 1400 కిలోమీటర్లు పాదయాత్ర చేసి సోమవారం శబరిమల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. మండల కేంద్రం నుంచి ప్రసూన్‌కుమార్, రాజు, సుభాష్, శ్రవణ్, అనిల్ అక్టోబర్ 28న రుద్రూర్ నుంచి కాలి నడకన శబరిమల పుణ్యక్షేత్రానికి బయలుదేరగా డిసెంబర్ 10న కేరళలోని శబరిమలకు చేరుకున్నారు.

# జైశ్రీరాం బియ్యం ధరలకు రెక్కలు

- క్వింటాల్‌కు రూ.5,500 ధర
- పాతవాటికి మరో రూ.వెయ్యి ఎక్కువే
- అత్యంత సన్న రకం కావడంతో డిమాండ్

**మోర్తాడ్(బాల్కొండ):** సన్న రకం బియ్యంలో అత్యంత సన్న రకమైన జై శ్రీరాం బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. క్వింటాల్ బియ్యాన్ని రూ.5,500కు వ్యాపారులు విక్రయిస్తున్నారు. పాతవి అయితే మరో రూ.వెయ్యి అదనంగా వసూలు చేస్తున్నారు. జైశ్రీరాం రకం బియ్యం బీపీటీ, హెచ్ఎంటీలతో పోలిస్తే మరింత సన్నగా ఉండడంతో అనేక మంది ఇష్టపడుతున్నారు. వర్షాకాలం సీజన్‌లో దాదాపు 15 వేల ఎకరాల విస్తీర్ణంలో జైశ్రీరాం రకం వరిని రైతులు సాగు చేశారని అంచనా. మార్కెట్‌లో క్వింటాల్ ధాన్యాన్ని రూ.3వేల వరకు విక్రయించారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే బోనస్ వర్తిస్తుందని తెలిసినా రైతులు వ్యాపారులకే విక్రయించి ఎక్కువ లాభం పొందారు. మిల్లర్లు కూడా జై శ్రీరాం రకం ధాన్యం కొనుగోళ్లకు మొగ్గుచూపారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, బాల్కొండ, ఏర్గట్ల, మెండోరా, ముప్కాల్, వేల్పూర్ మండలాల్లో ఎక్కువగా సాగైంది. జగిత్యాల్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలంలోనూ జైశ్రీరాం రకం సాగు చేయగా అక్కడి నుంచి ధాన్యాన్ని వ్యాపారులు దిగుమతి చేసుకున్నారు. ఎగుమతులకు డిమాండ్ ఉన్నా స్థానికంగానే అనేక మంది జై శ్రీరాం రకంను కోరుతుండటంతో వ్యాపారులు ఇక్కడే విక్రయిస్తున్నారు. జైశ్రీరాం రకానికి బెంగళూర్, హైదరాబాద్‌లో ఎక్కువ డిమాండ్ ఉంది. జైశ్రీరాం రకం వరి విత్తనాలను ప్రైవేట్ కంపెనీలు అందుబాటులో ఉంచుతున్నాయి. యాసంగి సీజన్ ఈ రకం సాగు చేసేందుకు అనువైన పరిస్థితి కాకపోవడంతో వర్షాకాలం సీజన్‌లోనే సాగు చేస్తున్నారు. ఏది ఏమైనా మార్కెట్‌లో డిమాండ్ పెరగడం, ధర ఆశాజనకంగా ఉండటంతో జై శ్రీరాం రకం వరి ధాన్యం పండించిన రైతులు, నిలువ చేసుకున్న వ్యాపారుల పంట పండిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

